క్లుప్తంగా

గ్రాండ్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల అర్బన్: ఆగస్టులో జరగబోయే టీఎస్ పీఎస్సీ గ్రూప్–2 సంబంధించి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రాండ్ టెస్టులను అభ్యర్థులను సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఈనెల 19నుంచి జూలై 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 8వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో పేపర్–1 ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 1:30గంటల నుంచి 4గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08546–293022 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో మహిళలకు మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారిని డాక్టర్ ప్రసూనరాణి మహిళలకు పరీక్షలు నిర్వహించి వారికి కావల్సిన మందులు అందజేశారు. ఆరోగ్యంపై తీసుకోవల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు దాదాపు ఏడు నెల ల వేతనాలు పెండింగ్ ఉన్నాయని, దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల వేతనా లు చెల్లించాలని, లేదంటే పెద్ద ఎత్తున్న కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు భీసన్న, వెంకటేష్, గో విందు, బుడ్డన్న, రాజు, ఆంజనేయులు ఉన్నారు.

బాత్‌రూంలకు కిటికీలు ఏర్పాటు చేయండి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల బాత్‌రూంలకు కిటికీలు లేక అవస్థలు పడుతున్నారు. కిటికీల నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థినులు కోరుతున్నారు. మరుగుదొడ్లకు, మూత్రశాలకు వెళ్లేందుకు బాలికలకు కిటికీలు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. పాఠశాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలి. వర్షాకాలం చుట్టు పక్కల ఉన్న పంటపొలాల నుంచి విషసర్పాలు వచ్చే అవకాశం ఉంది. దీనిపై ఎంఈఓ శివప్రసాద్‌ను వివరణ కోరగా, మన ఊరు–మన బడి కింద చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నిధులు మంజూరయ్యాయి. పెండింగ్ పనులు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులుతో చర్చించి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

బెంగల్ రైలు ప్రమాదం దురదృష్టకరం

శాంతినగర్: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైల్వే ప్రమాదం దురదృష్టకరమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో మంగళవారం ఆయన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే నాలుగు రైల్వే ప్రమాదాలు జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. రైల్వే ప్రమాద ఘటనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్ర భుత్వం రూ.50 లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డేవిడ్, రమేష్, రవి, జాన్, సిద్దార్థ, భీముడు పాల్గొన్నారు.

ఘనంగా మాసుంపీర్ దర్గా ఉత్సవాలు



అయిజ: మండల కేంద్రంలో వెలసిన మాసుంపీర్ దర్గా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం భక్తులు ఉర్సు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉర్సు ఉత్సవాలకు హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం జార్తులు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.

వైద్యుడు లేని బస్తీ దవాఖానా?

- గతేడాది అట్టహాసంగా ప్రారంభం
- దవాఖానా ఏర్పాటుకు రూ.13 లక్షలు మంజూరు
- లాంగ్ లీవ్‌లో మెడికల్ ఆఫీసర్
- స్టాఫ్‌నర్స్‌తో రోగులకు వైద్యసేవలు



అయిజలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా

అయిజ: పట్టణాల్లో ప్రజలకు వైద్యం అందించేందుకు అప్పటి ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. అయిజ పట్టణంలో బస్తీ దవాఖానను ఏర్పాటు చేసేందుకు భవనాన్ని నిర్మించలేదు. గతంలో ప్రభుత్వ బాలికల పాఠశాల కోసం నిర్మించిన భవనాన్ని దవాఖానా కోసం ఎంపిక చేసుకున్నారు. ఆ భవనం అప్పటికే శిథిలావస్థకు చేరింది. దానికి మరమ్మతులు చేశారు. మెడికల్ ఆఫీసర్ గదితో పాటు ఫార్మసీ, ల్యాబ్ గదులను ఏర్పాటు చేశారు. భవనానికి రంగులు పూసి ఫర్నీచర్ ఏర్పాటు చేసి మమ అనిపించారు.

అట్టహాసంగా ప్రారంభం..

అయిజ పట్టణంలోని 13వ వార్డు సంత బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు 2023 మే 20న అప్పటి ఎమ్మెల్యే అబ్రహం బస్తీ దవాఖానా ప్రారంభించారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్తీ దవాఖాన అందుబాటులో ఉంటుంది. దవాఖానాలో మెడికల్ ఆఫీ సర్, స్టాఫ్‌నర్స్, హెల్పర్ ఉండాల్సి ఉంది. అయితే మెడికల్ ఆఫీసర్ లాంగ్ లీవ్‌లో ఉన్నాడు. ప్రతిరోజు 40 నుంచి 50 మంది ఔట్ పేసెంట్లు వస్తుంటారు. స్టాఫ్‌నర్స్ ఒక్కరే రోగులకు వైద్యం చేయాల్సి వస్తోంది. దవాఖానాలో మెడికల్ ఆఫీసర్ లేకపోవ డం వల్ల మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. 45 రోజులుగా మెడికల్ ఆఫీసర్ బస్తీ దవాఖానాకు రాకపోయినా, వేరే మెడి కల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్య సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్తీ దవాఖానా పక్కన నిలిచిన మురుగు

మెడికల్ ఆఫీసర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తాం..

ప్రస్తుతం ఉన్న కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ లాస్ ఆఫ్ పే కింది లాంగ్ లీవ్‌లో ఉన్నాడు. వేరే మెడికల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేద్దామనుకుంటే ఎంబీబీఎస్‌లను మాత్రమే మెడికల్ ఆఫీసర్‌లుగా తీసుకోవాలనే నిబంధన ఉంది. ఈనెలాఖరు వరకు చాలామంది కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లు లీవ్ తీసుకున్నారు. త్వరలోనే మెడికల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేస్తాం.

– సిద్దప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

మెడికల్ ఆఫీసర్ రావడంలేదు..



బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి సంవత్సరమైంది. చాలా కాలం నుంచి మెడికల్ ఆఫీసర్ లాంగ్ లీవ్‌లో ఉన్నాడు. దీంతో వైద్య సేవలు నిలిచాయి. రోగులు ఇ బ్బందులకు గురవుతున్నారు. స్టాఫ్‌నర్స్ వైద్య సేవలు అందిస్తున్నా, మెడికల్ ఆఫీసర్ లేక పోవడంతో కొంతమంది పేషెంట్లు అసంతృప్తికి గురవుతున్నారు. వెంటనే మెడికల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలి.

– చాంద్ బాషా, అయిజ

పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి



బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు కానీ, మెరుగైన వసతులు లేవు. చుట్టు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షం పడిన ప్రతిసారి బస్తీ దవాఖానా చుట్టు పక్కల వర్షంనీరు నిలిచి ఉంటుంది. మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ఉధృతి చెందుతున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి.

– శ్రీనివాసులు, అయిజ

మెరుగైన వైద్యం అందించాలి



బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్య సేవలు అందించడం లేదు. దవాఖనలో ఎప్పుడూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి. అవసరమైన మందులు దవాఖానాలో ఏర్పాటు చేసుకోవాలి. ల్యాబ్‌లో అన్ని రకాల టెస్టులు చేయాలి. ల్యాబ్ టెక్నీషియన్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– వెంకటేష్, అయిజ

ఉచితంగా 25శాతం సీట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాచర్ల ప్రకాష్

గద్వాల అర్బన్: ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, అనాథలు, దివ్యాంగులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ క్యాపిటల్ ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్, షూస్ తదితర వాటిని విక్రయిస్తున్నారని దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం 2009ను పాటించని, 25శాతం ఉచితంగా పేదలకు సీట్లు ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మణిరాజ్, సునంద్, లక్ష్మణ్, ప్రేమ్‌రాజ్, అశోక్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భైరాపురంలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి శివ ప్రసాద్ మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు సమయానికి, రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

అలంపూర్ రూరల్: మండలంలోని కోనేరు గ్రామం యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో మొత్తం విద్యార్థులు 65 మంది ఉన్నట్లు అందులో బాలికలు 29, బాలురు 36 మంది విద్యార్థులకు స్కూల్ యూఫామ్స్‌ను, పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు హెచ్ఎమ్ శేఖర్ తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేసిన ఉపాధ్యాయులు

పక్కాగా.. నల్లాల లెక్క

- ముమ్మరంగా మిషన్ భగీరథ ఇంటింటి సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- యాప్‌లో నల్లాల ఫొటోలు తీసి పర్యావేక్షణ
- సర్వేలో పంచాయతీ రాజ్ శాఖ, మహిళా సంఘాల సిబ్బంది



ఉండవెల్లిలో మిషన్ భగీరథ సమస్యలపై ఆరా తీస్తున్న జిల్లా అధికారులు

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధజలాన్ని అందజేస్తున్నామని మిషన్ భగీరథ విభాగం ఇంజినీర్లు పేర్కొంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక మిషన్ భగీరథపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు నీరు అందుతుందా లేదా? అన్న వివరాలు తెలుసుకోవడంతో పాటు కేంద్రం నిధులు పొందేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ప్రారంభమైంది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులు పంచాయతీల్లో సర్వేలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో 22 వేల ఇండ్లు పూర్తి..

అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి సర్వే ముమ్మరం చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో 49 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉండగా, ఇప్పటి వరకు 21 నుంచి 22 వేల ఇంటి నల్లాల సర్వే పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

వివరాలు ఇలా..

సర్వే నిర్వహించే వారు ప్రతిరోజు నిర్దేశించిన ఇళ్లను సందర్శించాల్సి ఉంటుంది. ఆయా ఇళ్లకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా? పైప్‌లైన్లు ఎలా ఉన్నాయి? ట్యాంకు నీరు ఏ మేరా నల్లా ద్వారా ఇళ్లకు చేరుతుంది. వాటిని ప్రజలు ఏ మేరకు వినియోగిస్తున్నారు. ఒక్కో ఇంటికి ఏ మేరకు ఎన్ని లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా? అన్న వివరాలతో ఆధార్, ఫోన్ నంబర్లు అదే విధంగా ఆ ఇంటి కుటుంబ సభ్యుడి ఫొటో తీసి యాప్‌లో పొందపరుస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘ సభ్యుల నేతృత్వంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. మహిళా సంఘం సభ్యుల నేతృత్వంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి నల్లా కనెక్షన్ ఉందా? ఉంటే నీరు ఎలా వస్తుంది. ప్రతిరోజు ఎన్ని లీటర్లు సరఫరా అవుతున్నాయి. తదితర అంశాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు కాకుండా ఇంకా ఏవైనా వనరుల ద్వారా నీళ్లు వస్తున్నాయా? వంటి వివరాలు తెలుసుకుంటున్నారు. వాటిని మండల కార్యాలయం, అక్కడి నుంచి జిల్లాకు ప్రతి రోజు పంపిస్తున్నారు. ఇంటింటి సర్వే అనంతరం వాస్తవంగా మిషన్ భగీరథ రిజర్వాయర్లు, నీటి పంపులు, ట్యాంకులు, పైప్‌లైన్‌ల వివరాలు సైతం యాప్‌లో పొందపర్చుతున్నారు.



కలుగోట్లలో భగీరథ నీటి కనెక్షన్‌ను యాప్‌లో నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు..

మిషన్ భగీరథ పథకం లక్ష్యం ఏ మేర అమలవుతుంది. కుళాయి నీరు ప్రజలు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు. తదితర విషయాలపై, పలు అంశాలపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఇదంతా ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పొందపరుస్తారు. దీంతో సమగ్ర నివేదిక సిద్ధం కానుంది.

– శ్రీధర్ రెడ్డి, డీఈ, మిషన్ భగీరథ

నులిపురుగులను నిర్మూలిద్దాం





పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు

అలంపూర్: నులిపురుగులను నిర్మూలిద్దామని మండల వైద్య అధికారిణి ప్రసూన రాణి తెలిపారు. అలంపూర్ మండలం క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాల్లో ఈ నెల 20వ తేదీన నులిపురుగుల నివారణ మందుల పంపిణీ వివరాలు మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా మండల వైద్య అధికారిణి ప్రసూన రాణి అల్బెండజోల్ మాత్ర పంపిణీ వివరాలను తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు–51, పీఎస్‌లు–25, యూపీఎస్‌లు–07, జెడ్పీహెచ్ఎస్‌లు–9, కేజీబీవీ–1, ప్రభుత్వ జూనియర్ కళాశాల–1, ప్రైవేటు పాఠశాలలు–8 ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతిలో బాలికలు 822 మంది, బాలురు 870 మంది మొత్తం 1692 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి బాలికలు 1127 మంది, బాలురు 871 మంది మొత్తం 1998 మంది, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికలు 552 మంది, బాలురు 543 మంది మొత్తం 1095 మంది, అంగన్‌వాడీ కేంద్రాలు అర్బన్‌లో బాలికలు 586 మంది, బాలురు 580 మంది మొత్తం 1166 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు బాలికలు 1159 మంది, బాలురు 1282 మంది మొత్తం 2441 మంది, ప్రైవేట్‌లో 6 నుంచి పైతరగతుల్లో బాలికలు 1345 మంది, బాలురు 699 మంది, మొత్తం 2044 మంది ఉన్నారు. ఇతరములు బాలికలు 55 మంది, బాలురు 43 మంది మొత్తం 98 మంది ఉన్నారు. వారికి ఈ నెల 20వ తేదీన అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన

మండలంలోని ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులకు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూ చించారు. చేతులు పరిశుభ్రంగా లేకపోతే వ్యాపించే వ్యాధులను వివరించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్య విస్తరణ అధికారి లక్ష్మీకాంత్, ఆరోగ్య సహాయకులు బాలీశ్వరయ్య శెట్టి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు ఏర్పాటు చేయండి



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఆటలాడుతున్న విద్యార్థులు (ఫైల్)

అయిజ: మండలంలో మున్సిపాలిటీలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను నేర్పించాలని నిబంధనలున్నా అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు నీరుగారుతున్నాయి. మండలంలో చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభను కనబర్చుతున్నారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి వివిధ ఆటవస్తువులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం అని ఉపన్యాసాల్లో మాట్లాడుతున్న అధికారులు ఆచరణలో మాత్రం అది పాటించడంలేదు. మండలంలో 28 ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. వాటితో పాటు ఉర్దూ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడామైదానాలు ఏర్పాటు చేసి వారికి కావల్సిన ఆట వస్తువులను సమకూర్చాలి. వివిధ ఆటల్లో మెలకువలు నేర్పించాల్సిన అవసరం ఉంది.

శిక్షణ తరగతుల పోస్టర్ విడుదల

రాజోళి: ఈనెల 27, 28 తేదీల్లో గద్వాలలో నిర్వహించే కేవీపీఎస్ సామాజిక శిక్షణ తరగతులకు కేవీపీఎస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కేవీపీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రం లో దానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ తరగతులకు జిల్లా నలుమూలల నుంచి 2,500 మంది కేవీపీఎస్ కార్యకర్తలు వివిధ అంశాలపై తర్ఫీదు పొందుతారన్నారు. సామాజిక అంశాలపై వివక్షలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, సామాజిక ఉద్యమ నాయకుడు గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెద్దింటి మూగెన్న, మద్దిలేటి, మోహన్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, కోటి నాగప్ప, పెద్ద షాలు, బొమ్మన్న, దేవరాజు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రసాయన ఎరువులు తగ్గించాలి



మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

మల్దకల్: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందని ఏఓ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు తదితర గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.